# అంకితం

శ్రీ అంగర వేంకట సత్యనారాయణరావు

తనపాలిటి భాగ్యదేవతఅయిన సాధ్వీమణి ఋణం తీర్చుకోవడంకోసం కొండయ్య త్వరగా నడుస్తూ బజారువెట్టు పోయేడు. అక్కడ ఒక గ్రంథమాలవారి కార్యాలయం గోచరించింది. కొంతసేపు గుమ్మంలో నిలబడి తదేకధ్యానంతో చూసి, లోపలికి ప్రవేశించేడు. ఎదురుగుండా కుర్చీలో ఒకాయన కనిపించేడు. ఆయన్ని సమీపించి, దీనంగా ఆయనవెట్టు చూస్తూ నిలబడ్డాడు కొండయ్య. పనిలోఉన్న ఆయన ఒకసారి తలెత్తి కొండయ్యవైపు చూసేడు. కొండయ్య దీనదృక్కుల్ని ఆయన ప్రసన్నవదనం ఆహ్వానం చేసింది. కొండయ్య దీనంగా,

'అయ్యా! ప్రకాశకు లెక్కడుంటారు?'

'నేనే'

'చిత్తం-!'

'ఏంపనిమీదొచ్చేరు-?'

'తమ సహాయంకోరి'

'ఏం సహాయం? సరే చెప్పండి, నాకు సాధ్యమైనంతమట్టుకు...'

'చిత్తం'

'అయితే ఆ గ్రంథం ఏమిటి?

కొండయ్య కళ్లంట నాలుగు కన్నీటిబొట్లు రాలేయి. ధైర్యం తెచ్చుకొని,

'నిరాశ!' అన్నాడు.

'నిరాశా?' అని ఆశ్చర్యంగా ప్రశ్నించేడు ప్రకాశకుడు.

కొండయ్యకి తల్లిదండ్రులు లేరు. అతని చిన్నప్పుడే చనిపోయారు. దిక్కులేక కొంచెం జ్ఞానం రాగానే భిక్షం ఎత్తుకుంటూండేవాడు. ఒకనాడు భిక్షం ఎత్తుకుంటూ ఒక యింటిముందు నిలబడి 'అమ్మా! భిక్షం పెట్టండి' అని దీనంగా కేకవేసేడు. యింతట్లో ఆ యింట్లోంచి ఒకసాధ్వి దోసెడుతో బియ్యం తెచ్చింది. భిక్షుకుణ్ణి చూసింది. హృదయం కళుక్కుమంది ఆవిడకి. దోసెడుతో బియ్యం అలాగే పట్టుకొని కొంతసేపు నిలబడిపోయి 'అబ్బాయీ! యిలారా' అని లోపలికి పిలిచింది. జంకుతూ కొండయ్య లోపలికి వెళ్లేడు.

భిక్షుకుణ్ణి ఆసాధ్వి ఒకచాపమీద కూర్చోబెట్టి అతనిపేరు, అతని తల్లిదండ్రులగురించి భోగట్టా చేసింది. అతని విషాదజీవిత చరిత్ర విన్నకన్నీరైపోయింది. వెంటనే అతని భిక్షాపాత్రిక లాక్కొని విసిరేసి 'కొండయ్యా! యింకదగ్గరనుంచీ నువ్వు యిక్కడేఉండు. నీకు భోజనానికి, బట్టకి లోటులేదు' అంది. కొండయ్య కొండెక్కిపోయాడు. కొండయ్యకు విద్యలేదని తెలుసుకొని అతనికి చదువు చెప్పించింది. అతనికి ఆమే తల్లి, ఆమే తండ్రి. కొంతమట్టుకు తల్లిదండ్రులులేని కొరత తీరింది.

కొండయ్య సహజంగా చాలా తెలివైనవాడు, చురుకైనవాడు. బాల్యావస్థలోనే అతనికి సంభవించిన దుర్భర దారిద్ర్యం అతని చురుకుతనాన్ని నిష్ఫలంగా కట్టిపెట్టింది. తల్లిదండ్రులిద్దరూ దివంగతులై పోగానే దిక్కులేక కూటికోసం భిక్షాపాత్రికచేత్తో ధరించేడు. కొన్ని సంవత్సరాలవరకు అతని భాగ్యరేఖ బైటపడలేదు. అతని సుగుణపుంజం లోకానికి తెరచాటైపోయింది. కాని అతను భిక్షాపాత్రికతో సహా ఆసాధ్వి గృహంముందు దీనంగా భిక్ష వేడుకున్ననాడే అతని భాగ్యరేఖ బైటపడింది. ఆసాధ్వి అతని విశాల

ఫాలభాగంమీద తాండవిస్తూన్న సద్భావపుంజాన్ని గుర్తించి మహా ఉదార స్వభావంతో అతన్ని ఆహ్వానించి, శరణుయిచ్చింది.

కొండయ్య విద్యావంతుడయేడు. ఆసాధ్వి అంటే అతనికి మహాగౌరవం. తన శరీరం చెప్పులు కుట్టి యిచ్చినా ఆమె ఋణం తీరదన్న గట్టి నమ్మకం అతనికుంది. భిక్షుకుణ్ణి చేరదీసినందుకు సంఘం ఆమె పట్ల కొంత నీరసభావం వహించింది. కాని ఆమె దీనిని లక్ష్యం చెయ్యలేదు. ఆమె ఒక్కటే నిశ్చయించింది. కొండయ్య నిర్భాగ్యుడు, ప్రపంచజ్ఞానం పూర్తిగా సంపాదించని బాలుడు, పైగా తల్లిదండ్రుల్ని గోల్పోయేడు. దిక్కులేక కూటికోసం భిక్షాపాత్రిక పుచ్చుకున్నాడు. అంచేత అటువంటి దీనుణ్ణి, దిక్కులేని పక్షిని, రక్షించడంకన్న ధర్మం యింకొకటిలేదని విశ్వసించింది. అతనికి అభయహస్తం యిచ్చింది.

అలాంటి మహాసాధ్వి ఋణం ఏవిధంగా తీర్చుకోవడమో కొండయ్యకి తెలియలేదు. ఒకటే అతని విధ్యుక్తం! తన జీవితంలో సర్వదా ఆమెను తన హృదయంలో ప్రతిష్ఠచేసుకొని నిత్యం ఆమె పదపద్మాలను ఆరాధిస్తూండడం, ఆమె ఆజ్ఞ శిరసావహించడమే తన ముఖ్య కర్తవ్యం. విద్య పూర్తిచేసి అధిక శ్రమవల్ల పైఊళ్లో ఒక ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఆమెతో ఈ భోగట్టా చెప్పేసరికి ఆమె సంతోషం పట్టలేక పోయింది. అశ్రుపూరితలోచనాలతో కొండయ్య కొంతతడవు ఆమె ఎదుట మౌనంగా నిలబడి, చివరకి ఆమెవద్ద శెలవు పుచ్చుకొని వెళ్లిపోయేడు. ఉద్యోగంలో ప్రవేశించి జీవితం స్వతంత్రంగా గడుపుకొంటున్నాడు.

కొండయ్యకు సారస్వతసేవ అంటే మహాభిలాష. తన రచనలు పత్రికలమూలాన లోకానికి తెలియజేస్తూండేవాడు. తన నిర్భాగ్యజీవితంలో మృగ్యంగా ఉన్న భాగ్యరేఖలను ప్రస్ఫుటింపజేసి, తనపాలిటిపెన్నిధి అయిన ఆమహాసాధ్వి ఉదారస్వభావాన్ని పూర్తిగా మననంచేసుకొని, హృత్ఫలకంమీద చిత్రించుకొని, ఆ ఉత్తమాదర్శాల సహాయంతో మహిళల ఉదారస్వభావాలని తన రచనల మూలాన లోకానికి తెలియజేస్తూండేవాడు. దాతృత్వం, సహనం, దీనజనరక్షణ, సాహసం మొదలైన ఉత్తమగుణాలు మహిళల హృదయాంతరాళాల్లో అంకురించి, దీనజనపోషణకు ఏమాదిరిగా దోహదం అవుతాయో తెల్పేవిషయాలు తన రచనల మూలాన తెలియజేసేవాడు.

ఆమెను దర్శించి చాలకాలమైంది. కళ్లు కాయలుకాసిపోయేయి. ఒక్కనాడు శెలవుపుచ్చుకొని ప్రయాణం అయేడు. ఆసాధ్వి-కాదు! తనమాతృదేవి గృహంచేరేడు. హృదయం పటేలున బద్దలైపోయింది, మఱి అక్కడ నిలువలేక ఉత్తరక్షణంలో తనయిల్లుచేరుకున్నాడు.

తన భిక్షాపాత్రిక లాగుకొన్న ఆపవిత్ర హస్తాల్ని మరచిపోవడం ఎలాగా-? తనలో పొడసూపిన అభివృద్ధిని కనిపెట్టిన ఆప్రసన్న వదనాన్ని చూడకుండా ఉండడం ఎలాగా-? ముఖ్యంగా తనపాలిటి భాగ్యదేవత ఋణంతీర్చుకోవడం ఎలాగా--? పూర్తిగా సాధ్యంకాదు. ఒక్క పరమాణువు సమర్పించి అయినా-? తన ఆశలపంటకోసం అసువులు సమర్పించింది ఆ మహాసాధ్వి. ఆమె తెరచాటైపోగానే తన ఆశలు నిరాశలుగా కరుడుగట్టేయి. ఈవిషాదగాథ కొండయ్య హస్తాల్లో 'నిరాశ' అనే ఒక గ్రంథరూపందాల్చింది.

కొండయ్యకు సహాయంచేస్తానన్న గ్రంథమాల ప్రకాశకుడు గ్రంథమాల అభివృద్ధి సందర్భంలో ఆసాధ్వి వల్ల భూరివిరాళంపొందేడు. ఆయనతో కొండయ్య 'నిరాశ' అనే గ్రంథంగురించి సవిస్తరంగా చెబుతూ ఆగ్రంథాన్ని ఆమె పవిత్రాత్మకు 'అంకితం' యిస్తున్నానని చెప్పి, ప్రచురించమని కోరేడు. ప్రకాశకుడు ఈ అంకితాన్ని చూసి రెండుబాష్పబిందువులు రాల్చి గ్రంథాన్ని పుచ్చుకొని, శీఘ్రంప్రచురిస్తానని సవినయంగా కొండయ్యతో మనవిచేసేడు. కొండయ్య కొంత మనశ్శాంతిపొంది యింటికి మరలిపోయేడు.